

# సుతా విజయం

వెంకటేశ్వరాలయం నుంచి వినిపిస్తున్న సుప్రభాతంతో మెలకువయింది శ్రీనివాసులుకు. వాచ్ చూశాడు. మబ్బుల ఐదు గంటలవుతోంది. కిటికీ నుండి చల్లనిగాలి ఇంట్లోకి రివ్వున వీస్తోంది.

అతను కిటికీలోంచి ఆకాశంవైపు చూశాడు. మబ్బులు కమ్మి ఉన్నాయి. ఉదయం తెలతెల వారాల్సిన సమయం చీకట్లు ముసిరి ఉన్నాయి. కాల కృత్యాలు తీర్చుకున్నాడు. జీరో బల్బు వేసుకుని చద్దరు పరిచాడు.

రామ్‌దేవ్‌జీ యోగాసనాలు చేస్తున్నాడు. అతను రోజూ ఉదయం ఓ గంట ఆసనాలు వేస్తాడు. యోగా వల్లనే అతని బి.పి, షుగర్ నియంత్రణలో ఉంటున్నాయి. బయట వాతావరణం చల్లగా ఉంది. తలుపు తీయాలనిపించలేదు అతనికి.

ట్యూబ్‌లైట్ వేసుకుని సోఫాలో కూచొని గోర్కి 'అమ్మ' నవలలో దూరాడు. కిర్రుమన్న గేటు చప్పుడు ఏకాగ్రతకు చిన్న భంగపాటు. అడుగుల సవ్వడి. పని మనిషి ఆగమన సూచన. వాకిలి ఊడుస్తున్న శబ్దం.

ఒక్కసారిగా పనిమనిషి కెవ్వుమన్నకేక.క్షణం భృకుటి ముడివడింది. క్షణం ఆలోచించాడు. తలుపు తీశాడు. మబ్బులు విడవడుతున్నాయి. లేతభానుని కిరణాలు దర్వాజాలో పడుతున్నాయి.

పరిసరాలు, పూలచెట్లు, కొబ్బరి చెట్లు పసిడి వర్ణంలో మెరిసిపోతున్నాయి. పనిమనిషి గుమ్మంవద్ద నిలుచుని ఉంది. షివర్ అవుతుంది. ఏదో చెప్పాలని తటపటాయిస్తోంది. ఆమె ముఖంలో భయం..., ఆందోళన..., ఆదుర్దా! విషయం అతనితో చెప్పడానికి సంకోచిస్తోంది.

''అమ్మా...! అమ్మా...!'' అని పిలుస్తూ ఇంట్లోకి తొంగి చూస్తోంది. శ్రీనివాసులు లోనికెళ్ళి వాళ్ళావిడను లేపాడు.

''తెల్లారగట్ల ఏంది లేపవడితివి. తెల్లరేదాక నిదుర పట్టలేదు. ఇప్పుడే కన్నంటుకుంది'' ఆమె కళ్లు తెరువకుండానే గొణిగింది.

''తెల్లారిందే...! ఆరయితంది. పనిమనిషి నిన్ను పిలుస్తోంది. ఏదో విషయం చెబుతదట'' తట్టుతూ లేపాడు.

''ఏందట...! చీపిరి, మగ్గు, బకెట్... అన్నీ బయటనే ఉన్నయి గదా! ఇంకేం గావల్నట...!'' విసుగ్గా చీరకుపడుతూ లేచింది. చెదిరిపోయిన తలను సర్దుకుంటూ చీర సెంగులు సరిచేసుకుని మెల్లగా గుమ్మంవైపు నడిచింది.

యజమానురాలిని చూడగానే పనిమనిషి ''అమ్మా! మన కాంపౌండ్‌లో పూలచెట్లల్ల పొత్తిళ్లలో పసిబిడ్డను పడుకోబెట్టి ఉందమ్మా! రక్తం తడారలేదు!'' ఆదుర్దాతో గుక్క తిప్పుకోకుండా చెప్పింది. ఆ ఇంటి దంపతులిద్దరు ఒక్కసారిగా ఆశ్చర్య చకితులయ్యారు.

''ఏది... ఎక్కడ...?'' అంటూ ఉత్కంఠతో పని మనిషి వెంట నడిచారు. పచ్చని పొదల్లో పసికందు చిన్నగా కదులుతూ ఉంది. ఊపిరి బలహీనంగా ఉంది. పాప ఆరోగ్యానికి ప్రమాదం పొంచి ఉందని తలచారా దంపతులు.

'విచిత్రం...? ఏమిటీ...? ఎవరిక్కడ ఉంచారు...? ఎందుకిలా చేశారు...?!' అనేక ప్రశ్నలు ఉదయిస్తున్నాయి వాళ్ళకు. కర్తవ్యం గుర్తొచ్చింది. మొదట శిశువు ప్రాణాలు కాపాడాలి! మానవత్వం వాళ్ళను తొందర చేస్తోంది.

పంజాల జగన్నాథం

''ఇది పోలీసు కేసయితది. పోలీస్ స్టేషన్ల తెలుపాలె! లేకపోతే గాలికిబోయే కంప ముడ్డికంటుకుంటది!'' హెచ్చరించింది వాళ్ళావిడ శ్రీనివాసులును.

''పద్ధతి... గాడిదగుడ్డూఅనుకుంట ఉంటే పసిగుడ్డు ప్రాణాలు గాలిల కలుస్తయి'' వీధిలో చుట్టుపక్కల వాళ్ళకు విషయం తెలిపాడు. బిలబిలమంటు జనం గుమిగూడారు ఇంటి ముందు.

పోలీసువాళ్ళకు తెలపాలని కొందరు..., ఏంగాదు నేరుగా హాస్పిటల్‌కు పోవాలె లేకపోతే పసిబిడ్డ ప్రాణం దక్కదు అని కొందరు... ''ఈ పాపానికి ఏ తల్లి ఒడి గట్టిందో... చేతులెట్లా వచ్చినయో. వయసు తిమ్మిరిల సోయిలేకుండా తిరుగుడు... కడుపయినంక కడుగేసు కునుడు... మించిపోతే గిట్ల కనివదిలేసుడు...!!'' కాండ్రకించి ఉమ్ముతూ ఓ ముసలమ్మ వాఖ్యానం...'' గుంపులోని జనం రకరకాలుగా మాట్లాడుతున్నారు.

''మీనమేషాలు లెక్కించుకుంటకూకుంటే బిడ్డ ప్రాణంపోయేటట్లుంది. జల్దిన దవాఖానకు తీసుకు పోండ్రి!'' ఓ బుర్రమీసాల వృద్ధుడి సూచన.

''సార్ మాది పోలీసు డిపార్టుమెంటే! ఈ వాడలనే కిరాయికుంటం. పోలీసుస్టేషన్ విషయాలు మేం జూసు కుంటం. పాపను దవాఖానకు తీసుకుపోదాం పదండి'' సివిల్ డ్రెస్‌లో వున్న పోలీసులు ధైర్యం చెప్పారు.

శ్రీనివాసులు ఇంకేమాత్రం ఆలస్యం చేయకుండా హాస్పిటల్‌కు తీసుకుపోయాడు. వీధివాళ్ళు కొంతమంది ఆయన వెంట వెళ్ళారు. ప్రభుత్వాసుపత్రిలో సందడి లేదు. రిసెప్షన్ గదిలో కాంపాండరు పేపరు చదువుతూ కనబడ్డాడు. కాంపాండర్ వద్దకు వెళ్ళి పాప పరిస్థితిని వివరించాడు. ''పాప చావుబతుకుల్లో ఉందనీ...! త్వరగా ట్రీట్‌మెంటు చేయాలనీ'' అన్నాడు.

''డాక్టర్ లేడు. వెయిట్ చేయండి''

''లేడంటే ఎట్లనయ్యా...! ఎటుపోయిండు?'' తీవ్రంగా అడిగాడు శ్రీనివాసులు.

''బయటకు వెళ్ళాడు'' తటపటాయిస్తు చెప్పాడు కాంపొండరు.

''ప్రజల డబ్బు తింటున్నమయ్యా! ప్రబుత్వ ఉద్యో గులందరం ప్రజాసేవకులమయ్యా...! వాళ్ళ ఉప్పు తింటున్నం...!!'' కోపాన్ని దిగమింగుకుంటూ అన్నాడు.

ప్రభుత్వాసుపత్రి పాడుబడ్డ ఇల్లులా ఉంది. వెంటి లేషన్, సానిటేషన్ సరిగాలేవు. అపరిశుభ్రమైన పరిస రాలు. ఈగలనాదం... దోమల సంగీతం... మెయింటి నెన్స్ సరిగా లేదు... శ్రీనివాసులు మనసు మూలిగింది.

## పసిమొగ్గ రాలినవేళ...

అతిక్రూరంగా కిరాతకంగా
జుగుప్సాకరంగా అసహ్యంగా
ముక్కుపచ్చలారని పసికందుని
దారుణంగా హతమారుస్తారా?
వారికి తలిదండ్రులు పిల్లలు లేరా?
సభ్యసమాజం గతుక్కుమంది
పిల్లస్నేహితులకు పుట్టిన్రోజు చాక్లెట్లు
ఎవరిస్తారు? ఎలా ఇస్తారు?
ఉపాధ్యాయులకు చిరునవ్వు సమాధానాలు
ఇంకెవరు చెబుతారు?
కారులో షికారు తీసికెళ్ళే డ్రైవరుని
కత్తిపోట్లతో చంపేస్తారా?
సమాజం పూర్తిగా కుళ్ళిపోయిందా
ఇక పిల్లలు స్కూళ్ళకెళ్ళగలరా
తండ్రులు ఆఫీసులకెళ్ళగలరా
రామరాజ్యాలు రాక్షసరాజ్యాలుగా
ఆధ్యాత్మిక కేంద్రాలు కమర్షియల్ సెంటర్లుగా
మారిపోతున్నాయా?
కిడ్నాపుల తతంగాలతో
వ్యవస్థ చితికి చితికి
ప్రజాస్వామ్య ముసుగు లేసుకుంటోందా?
కిరాయి హంతకులు
గల్లీ గల్లీల్లో నిండిపోయిందా
గ్రంధాలు ఉద్గ్రంధాలు మాయమై
కత్తులు తుపాకీలు కేంద్రాలయిపోతాయా?
ఆడతల్లులు జడిసిపోయి
ఇక పిల్లల్ని కనడం మానేస్తారా?

జి.వి.ఎస్.ప్రియంవద

కాంపౌండర్ సెల్‌ఫోన్ ద్వారా డాక్టర్‌కు విషయం చెప్పాడు. ఓ పదినిమిషాల్లో డాక్టర్ చేరుకున్నాడు. డాక్టర్ పాప పరిస్థితి చూశాడు. ''ఇది పోలీసు కేసండి. నేరుగా అడ్మిట్ చేసుకోరాదు'' డాక్టర్ సమాధానం.

''ఇదేంది సార్ ఫార్మాలిటస్ పూర్తి చేసేవరకు పాప బతుకుతుందా. హ్యూమనిటేరియన్ గ్రౌండ్స్‌లో టేకప చేయాలెసార్...!''

''రూల్స్ ఉంటాయండీ...!'' ఇంకేదో చెప్ప బోయాడు.

''డాక్టర్ సాబ్ ఇది వాదనకు సందర్భం కాదు. మనిషికి ఉపయోగపడని ఈ చట్టాలు... రూల్స్ ఎందుకు సార్! మానవత్వం కావాలె'' లోపభూయిష్టమైన వ్యవస్థమీద బాధతో మూలిగాడు.

ఇంతలో శ్రీనివాసులుతో వచ్చిన మఫ్టీలో ఉన్న పోలీసువాళ్ళతో ఒకాయన కల్పించుకుని ''సార్ మేం పోలీసోళ్ళం. మేం అవసరం ఉన్న పార్మాలిటీస్‌ను పూర్తి చేసుకుని వస్తాం. జర పాపకు జల్దిన ట్రీట్‌మెంట్ స్టార్ట్ చేయుండ్రి సార్!'' అంటూ తన ఐ.డి కార్డు చూపించాడు మఫ్టీలో ఉన్న ఓ పోలీసాయన.

''ఓ.కే'' అంటూ తల ఊపుతూ ట్రీట్‌మెంటు స్టార్ట్ చేశాడు.

❖ ❖ ❖

''సుమా!'' పిలిచాడు అరుణ్? పలుకలేదు. బిగ్గరగా పిలిచాడు. సుమ పార్క్‌లో ఫౌంటెన్ సమీపాన చెట్టుకింద సిమెంటు బెంచిమీద కూచొని ఉంది. కొండలమాటున దాక్కోబోతున్న పసిమిసూర్యుణ్ణి తదేకంగా చూస్తోంది.

''సుమా ఎందుకీ మౌనం. ఆలస్యంగా వచ్చానని అలుకా...!'' అంటూ పక్కన కొంచెం దూరంగా కూచున్నాడు అరుణ్.

''నీమీద నాకెందుకుకోపం. ఇ.టెక్ ఫైనల్ ఇయర్‌లో ప్రేమ తాపంతో వేగిపోయాం. ప్రాజెక్టు వర్క్ మనల్ని చేరువ చేసింది. మనసులు దగ్గరయ్యాయి. తనువుల కలయికతో అడ్వాన్స్ అయిపోయాం. చదువు పూర్తయింది. ఏదో మిషతో సిటీలోనే ఉంటున్నాం. పేరెంట్స్‌ని మోసం చేస్తున్నాం. ఎంతకాలమని మభ్యపెట్టగలం? ఇపుడు నేను ఉట్టిమనిషిని కూడా కాను. విదియనాడు కాకపోతే తదియనాడు తెలియకమానదు''

''సుమా నీ బాధ అర్థమయింది. మన పేరెంట్స్ ఒప్పుకుంటారంటావా...!! మన కులాలు వేరు! ఎలా అని ఆలోచిస్తున్నాను. సమయం చూసి మావాళ్ళకు చెబుతాను. నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తాను''

## ఒకమాట

అగాధాలను సృష్టించినా
అంతర్యాలను స్పృశించినా
అనుమాన జ్వాలలు రగిలించినా
వెన్నెల జల్లులు కురిపించినా
గుండెల్లో వేగాన్ని పెంచినా
హృదయ నాదాన్ని వినిపించినా
అస్త్రమై అంతం చేసినా
అమృతమై ప్రేమను పంచినా
ద్వేషాగ్ని కణాలతో దహించినా
ఆనంద భాష్పాలు కురిపించినా
ప్రళయమై విలయ తాండవమాడినా
ప్రణయమై పరవశాలు పండించిఆన
ఒక మాటకే సాధ్యం
మాటల మాంత్రికుడై
మనుగడ సాగించే... మనిషి
మాటపై నిలబడితే పురుషోత్తముడు
మాటల్లో తడబడితే మానవాధముడు
మాటలాడువేళ
ఆచితూచి మాట్లాడు
ఒక్క మాటేకదాని
నోరు జారావా...
పేలే తూటాలా
దూసుకొచ్చే బాణంలా
మాట
మనసును
గాయం చేస్తుంది
మనిషి
ప్రాణం తీస్తుంది

ఎస్.ఎం.సుభాని

## కొన్ని కొన్ని

కొన్ని జ్ఞాపకాలు
జీవిత పరిమళాన్ని పెంచుతాయి
కొన్ని అనుభవాలు
పరిపూర్ణతనిస్తాయి
కొన్ని స్పర్శలు
ఆత్మీయతను పెంచుతాయి
కొన్ని చూపులు
జీవితాంతం వెంటాడుతాయి
కొన్ని మాటలు
మనసును కాస్తాయి
కొన్ని నవ్వులు
గుండెను తోడేస్తాయి
కొన్ని సైగలు
మనసును వెంటాడుతాయి
కొన్ని ఓటములు
మంచి అనుభవాలుగా మిగులుతాయి
కొన్ని గెలుపులు
బాధ్యతలను పెంచుతాయి

డా॥ జరీనా బేగం

''అరుణ్ ఇంకెన్నాళ్ళు. ఈలోగా పుణ్యకాలం గడుస్తది, లోకం ముందర తలదించుకోవలసి వస్తుంది''

''ఊర్నుంచి ఫోనొచ్చింది అర్జంట్‌గా రమ్మని! రేపు ఊరెళ్ళిపోతున్నాను. ఇంకొంతకాలం ఓపికపట్టు తొందరలోనే తేలుస్తాను''

'ఊరెళ్ళుతున్నాడన్న అరుణ్ మాటలు' సుమ గుండెల్లో రైళ్ళు పరుగెత్తిస్తున్నాయి. ఏదో తెలియని గుబులు. కళ్ళనుండి నీళ్ళు జలజల జారాయి. మరుసటిరోజు ఇద్దరు పెట్టేబేడా సర్దుకుని ఎవరి దారిన వాళ్ళు వాళ్ళ ఊళ్ళకి వెళ్ళిపోయారు.

రోజులు గడుస్తున్నాయి. అరుణ్ నుంచి ఎలాంటి సమాచారం లేదు. చూసి చూసి ఓరోజు అరుణ్‌కు ఫోన్ చేసింది సుమ. అతను పొడి పొడిగా మాట్లాడాడు. అసలు విషయం దాటవేసాడు.

అరుణ్ మాట్లాడిన విధానంతో సుమకు ఒక్కసారిగా కోపం ముంచుకొచ్చింది. మొహం జేవురించింది. ''ఛీ! మీ మగజాతంతా ఇంతే! ప్రేమా... దోమా... అంటూ నమ్మిస్తారు. వాడుకుంటారు. వంచిస్తారు... వదిలేస్తారు'' దుఃఖం ముంచుకు రాగా ఉక్రోషంతో ఫోన్ కట్ చేసింది.

సుమ బాల్యంలోనే ఆమె తండ్రి కార్గిల్ యుద్ధంలో మరణించాడు. అప్పటి నుంచి ఆమె ఆలనా, పాలనా ఆమె తల్లి రాఘవమ్మ చూసుకుంటోంది. భర్త పింఛనుతో పాటు తను కుట్టుమిషన్ నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది.

ఓవైపు సుమ కడుపులో పాప పెరుగుతోంది. ఇంకొన్నాళ్ళయితే దాపినా దాగని సత్యం. సమాజం ముందర తలవంపులు! లోకం కోడై కూస్తది 'కులట, నీతి మాలింది అని!...' తలుచుకుంటేనే సుమ మనసు కలవరపడుతోంది. ఆమె జీవితం ప్రశ్నార్థకంగా మారింది. ఒక మాడితో మోసపోయి వంచనకు గురయింది. ఊహించని విపత్కర పరిణామాల్ని ఎదుర్కొంటోంది.

ఫోన్ సంభాషణ అంతా తల్లి రాఘవమ్మ వింది. ఉబుకుతున్న కోపాన్ని, బాధను గుండెల్లోనే దిగమింగుకుంది. కూతుర్ని దగ్గరగా తీసుకుని ''ఏమయిందమ్మా...? సిటీ నుంచి వచ్చినప్పటి నుంచి అదోలా ఉంటున్నావు. మీ సంభాషణంతా విన్నాను. ఏం జరిగిందమ్మా...? విపులంగా చెప్పు!'' అనునయంగా అంది.

సుమకు గతంలో జరిగిన సంఘటనలు కళ్ళముందు మసక, మసకగా కనిపించసాగాయి. గతం ఆమెకు ఏవగింపును కలిగిస్తోంది. 'అమ్మకు మించి ఆత్మీయురాలు, శ్రేయోభిలాషి ఎవరుంటారు... ఈలోకంలో...' అనుకుని తన గుండెల్లో దాచుకున్న గతాన్ని అమ్మముందు విప్పసాగింది.

''అమ్మా! నేను బి.టెక్ చదువుతున్నపుడు నా క్లాస్‌మెట్ అరుణ్‌తో ప్రేమలో పడ్డాను. అతనూ... నన్ను ఇష్టపడ్డాడు. మా మనసులో ఏదో మూగ భాష... పెళ్ళి చేసుకుంటానన్నాడు. మనసులతో పాటు తనువులూ కలిసాయి. కొంతకాలం ఏదో మిషచేత సిటీలోనే ఉన్నాం. ఫోనువస్తే అర్జంటుగా ఊరెళ్ళాడు. వాళ్ళ పేరెంట్స్‌ను ఒప్పించి ఫోన్ చేస్తానన్నాడు.

ఇన్నిరోజులు గడిచినా ఏ సమాచారం రాలేదు. చివరికి

నేనే ఫోన్ చేశాను. పాడి పాడిగా కుంటిసాకులు చెబుతూ పొంతనలేని మాట లతో మొహం చాటేసాడు. కోపం వచ్చి ఫోనులోనే చెడా వడా దులిపాను. అవమ్మా నేనిప్పుడు ఉట్టిమనిషిని కాదు'' గుండెల్లోని బాధను వెళ్ళగక్కుతూ సుమ తల్లిని పట్టుకుని భోరుమంది.

'ఉట్టి మనిషిని కాదు' అన్న మాటలు రాఘవమ్మ చెవుల్లో గింగురుమంటున్నాయి. కన్నకడుపు తరుక్కు పోతోంది. కోపంతో ఊగిపోయింది. ఆమె హృదయం బాధతో విలవిల్లాడింది.

'తక్షణ కర్తవ్యం' ఏమిటా? అని ఆలోచించసాగింది. 'ఆయనే ఉంటే ఇట్లాంటి క్లిష్టసమ యంలో కొండంత ధీవూ ఉండేదనీ... సమస్యను పరిష్కరించుకునే వాడనీ...' వాపోసాగింది రాఘవమ్మ బిడ్డను గుండెలకు అదుముకుంటూ.

''వయస్సులో ఉన్న యువత వాళ్ళ మధ్యన ఉన్న భౌతికాకర్షణను ప్రేమగా భావిస్తున్నారు. బాహ్యసౌంద ర్యాన్నే చూస్తున్నారు. ఇంకొందరు పెళ్ళిళ్ళను కేవలం డబ్బుతోనే ముడిబెతున్నారు. పూర్వంలో పెళ్ళి అంటే అటేడు ఇటేడు తరాలను పరిశీలించేవారు. అవి కల కాలం నిలిచేవి.

అమ్మా సుమా! నీకెన్నోమార్లు చెప్పాను. జీవితంలో ప్రేమకంటే ముందు కెరీర్ ముఖ్యమనీ... మారుతున్న కాలాన్ని, పరిస్థితులను గమనించాలనీ... దానికి తగ్గ ట్టుగా మసలుకోవాలనీ...!'' దిగాలుగా నిట్టూ ర్చింది రాఘవమ్మ.

సుమను రాఘవమ్మ ఉన్నత చదువుల నెపంతో గుట్టు చప్పుడుకాకుండా సిటీకి తీసుకుపోయింది. ఓ గదిలో అద్దెకుంటూ నెలనెలా డాక్టర్‌కు చూపిస్తోంది. సుమ రెగ్యు లర్‌గా మందులు వాడుతోంది. సుమకు ఏమీ పాలు పోవడంలేదు.

ఎడ తెరిపిలేని ఆలోచనలతో ఆమె మనస్సంతా చిందరవందరగా ఉంది. 'ఏమిటీ పురుష దౌష్ట్యం, పురుష అహంకారం, ఆధిపత్యం!' ఆమె హృదయం మూగగా రోదిస్తోంది. ఈ మగ సమాజంమీదనే ఆమెకు చెప్ప లేనంత అసహ్యం కలుగుతోంది. ఆలోచించి, ఆలోచించి మానసికంగా అలసిపోయింది.

రాఘవమ్మ ఆలోచనా విధానం వేరుగా ఉంది. గుట్టు చప్పుడు కాకుండా సుమకు పురుడుపోసి పాపను ఏ అనాథాశ్రమానికో అప్పజెప్పి ఆమెకు పెళ్ళి చేయాలనీ...! సుమకు నెలలు నిండాయి. హాస్పిటల్‌లో ప్రసవించింది. మెడిసన్స్ ప్రభావం వల్లనేమో ప్రసవించింది మొదలు సుమ మగతగా ఉంటోంది.

రాఘవమ్మ బిడ్డను డిస్‌చార్జ్ చేసుకుని గదికి తీసుకు వచ్చింది. కూతురు మగతగా ఉన్న సమయంలో రాఘ వమ్మ పసికందును ఓ ఇంటి లోగిలిలో పూలచెట్ల పొదల్లో వదిలి వచ్చింది. ఆ స్థితిలోనే సుమను వాళ్ళ ఊరికి తీసుకుపోయింది.

ఆమె క్రమంగా కోలుకోసాగింది. కోలుకుంటున్న సుమకు లీలగా తన బిడ్డ జ్ఞాపకం రాసాగింది. తల్లిని తన బిడ్డ గురించి అడుగసాగింది. రాఘవమ్మ తడ బడుతూ పొంతనలేని సమాధానాలు చెబుతోంది. సంతృప్తిచెందని సుమ తన బిడ్డను చూపించమని తల్లిని వేధించసాగింది. గత్యంతరం లేక అసలు విషయం చెప్పింది రాఘవమ్మ.

''నా బిడ్డను ఏ ఇంట్లో వదిలి వచ్చావో పద ఆ ఇంటికి. నా బిడ్డ నాక్కావాలి'' అంటూ సుమ నిప్పులు చెరిగింది. రాఘవమ్మ సుమను వెంటబెట్టుకుని సిటీకి బయలు దేరింది.

ఆ ఇంటికి చేరుకున్నారు. ఇంటి యజమానిని కలిసి ''అయ్యా రెండు రోజుల క్రితం మా పసిబిడ్డను మీ కాంపౌండ్‌లో వదిలి వెళ్ళాను'' అంటూ ఆనవాళ్ళు చెప్పింది వినయంగా రాఘవమ్మ.

ఇంటి యజమాని తలపంకిస్తూ ''ఆ పసిబిడ్డ ప్రాణం ప్రమాద స్థితిలోఉందని గమనించి చికిత్స నిమిత్తం ఎంతో ప్రయాసకోర్చి హాస్పిటల్లో చేర్పించాను. పోదాం రండి'' అంటూ తల్లీబిడ్డల్ని తోడ్కొని ఇంటి యజమాని హాస్పిటల్‌కు చేరుకున్నాడు. ఆయన డాక్టర్‌తో మాట్లాడి తల్లీబిడ్డల్ని పరిచయం చేశాడు.

''ఏమమ్మా బిడ్డను కనడంతోనే సరిపోదమ్మా! ఆ బిడ్డను పెంచి పోషించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదీ! బిడ్డల్ని అనాథలను చేసే హక్కు ఎవరికీ లేదు. ఇదేనా మానవత్వం...!?'' రాఘవమ్మను డాక్టర్ ఘాటుగా మందలించాడు.

''నా బిడ్డ ఎక్కడ...?'' ఆతృతతో అడిగింది సుమ. తల్లి హృదయం ఆదుర్దా చెందుతోంది.

''చికిత్స అనంతరం బాబను 'ప్రేమసమాజం' అనే స్వచ్ఛంద సంస్థకు అప్పగించాం'' అంటూ తదనంతరం జరిగినది వివరించాడు డాక్టర్. 'ప్రేమసమాజం' యాజ మాన్యం పేర ఓ ఉత్తరం రాసి రాఘవమ్మకు ఇచ్చాడు. తక్షణమే తల్లీబిడ్డలు ఆ ఉత్తరం తీసుకుని 'ప్రేమసమా జం' చేరుకున్నారు. ఉత్తరం నిర్వాహకులకు సమర్పించి విషయం వివరించింది రాఘవమ్మ.

61

ఇబ్బందులతో, అనారోగ్యాలతో ఎన్ని కష్టాలూ, ఎన్నెన్ని బాధలూ అనుభవిస్తున్నారో ఎప్పుడైనా గమనించావా...?''

''దానికి మనమేం చెయ్యగలంరా.... ఎవరి ఖర్మ వారిది''

''అదే పొరబాటు బాబాయ్..., నీ భార్యా, పిల్లలూ, మనుమలే కాదు నీవాళ్ళు. తోటి మానవులు కూడా నీవాళ్ళు అనుకోగలిగితే ఇప్పుడు నువ్వు అనుభవిస్తున్న నిర్వేదం నీ చెంత చేరదు. ఆపన్నులకు చేతనయినంత సహాయం చెయ్యాలి''

''అదంతా మనవల్లనేమవుతుంఇరా... నీ పిచ్చి గానీ...'' అన్నది వరలక్ష్మి.

''తలచుకుంటే మనిషి సాధించలేనిదేమీ లేదు పిన్నీ... మనం ఒంటరిగా చెయ్యలేమనకుంటే, మనవంటి వారిని మరో పదిమందిని కలుపుకుందాం''

''పదిమందీ మనమాట వింటారా...? మనతో కలిసి వస్తారా... నాకేం నమ్మకంలేదు'' అన్నాడు మూర్తి.

''అదే పెద్ద తప్పు బాబాయ్... మనం మన ఇంట్లో కదలకుండా కూర్చుని, మనం ఏం చెయ్యలేం... మనకేం సాధ్యంకాదు అనుకోకూడదు. మన ప్రయత్నం మనం చెయ్యాలి. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీజీకూడా ఒకప్పుడు సామాన్యుడే. అర్థబలమూ, అంగబలమూ ఏమీలేనివాడే. సత్సంకల్పమూ, దీక్షా, పట్టుదలల బలంతో ఆయన కార్యసిద్దిని సాధించలేదా...?''

''ఆయనకూ మనకూ పోలికెక్కడ...? నక్కకూ నాగలోకానికీ ఉన్నంత తేడా వుంది''

''ఉండచ్చు బాబాయ్... కానీ, అందుకు మనం నిరుత్సాహం చెందనవలసరం లేదు. మన పరిధిలో మన శక్తిమేరా మనమూ కృషి చెయ్యాలి. ఒక మంచి కార్యక్రమం మొదలుపెట్టు. అప్పుడు న మనసు ఉత్సాహంతో ఎలా గంతులు వేస్తుందో చూడు''

''ఇంకా నీకు అభిరుచి ఉండాలే కానీ, లలితకళలు ఎన్ని లేవు నేర్చుకుని సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి... సంగీతమూ, సాహిత్యమూ, చిత్రలేఖనమూ... వాటిల్లో పడితే నీకసలు టైము చాలదు తెలుసా...?''

''ఈ వయసులో మనకవి అంటుతాయట్రా...?''

''విద్యకు వయసుతో పని ఏముంది బాబాయ్... అబ్దుల్ కలామ్ గారు ఈ మధ్యనే వీణ నేర్చుకున్నారట...''

''బాబాయ్, నువ్వు పెద్ద చదువులు చదివినవాడివి. వయసు రీత్యా, అనుభవాలరీత్యా పండిపోయిన వాడివి. నీ ముందు నేనెంత...? ఆలోచించు బాబాయ్... అడుగు ముందుకు వెయ్ బాబాయ్... ఇది నీకు రిటైర్మెంట్ కాదు, రీఛార్జ్‌మెంట్ బాబాయ్...!

తనబలం తను తెలుసుకోలేని హనుమంతునిలా ముడుచుకుని ఉన్న నారాయణమూర్తి మనసు విష్ణు మాటలతో సూర్యరశ్మి తగిలి విచ్చుకున్న తామరపువ్వులా కళకళలాడింది. ఆ కళకళలు అతని ముఖంలోకి పాకి చిరునవ్వు వెన్నెలలు కురిశాయి.

ఎన్నాళ్ళ తర్వాతో చూసిన భర్త చిరునవ్వు వరలక్ష్మికి వెయ్యేనుగుల బలం తెచ్చింది.

''విష్ణూ నీ వైద్యానికి నిజంగానే పెద్ద ఫీజు ఇవ్వాలిరా... అంత ఇచ్చుకోలేను గానీ, మంచి కోడల్ని వెతికి తెచ్చిపెడతాను...'' విష్ణు తలమీద చెయ్యివేసి ప్రేమగా నిమిరింది వరలక్ష్మి. ■

---

58 నిర్వాహకులు ఆ తల్లీ బిడ్డల్ని కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలతో సంతృప్తి చెందారు. వాళ్ళ పాపే అని నిర్ధారణ చేసుకున్నారు. ఫార్మాలిటీస్ పూర్తిచేసి తల్లీ బిడ్డల సంతకాలు తీసుకున్నారు. 'పిల్లల్ని అనాధలను చేసే హక్కు ఎవరికి లేదనే' హితవు చెబుతూ వాళ్ళకు పాపను అప్పగించారు.

❖ ❖ ❖

సుమ తనను నమ్మించి మోసం చేసిన అరణ్‌మీద కోర్టులో చీటింగ్ కేసు ఫైల్ చేసింది. ఆమెకు పలు మహిళా సంఘాలు బాసటగా నిలిచాయి. 'సుమ తనకు పుట్టిన ఈ బిడ్డకు అరుణే తండ్రి...' అని వాదిస్తోంది. నారీలోకం సుమకు నైతిక ధైర్యాన్ని, స్థైర్యాన్ని అందిస్తున్నాయి.'పురుష దౌర్జన్యం' నశించాలని స్త్రీ సమాజం వెల్లు వలా పెల్లుభికింది. కోర్టు హాలులో కేసు వాద, ప్రతివాదా లతో దద్దరిల్లుతోంది. పేపర్లలో విభిన్న కథనాలు వెలు వడు తున్నాయి. జనం ఉత్కంటతో గమనిస్తున్నారు. సుమ వాదనను ధృవీకరించుకోవటానికి జడ్జి ఆదే శాలమేరకు అరుణ్‌కు డిఎన్ఎ పరీక్ష నిర్వహించారు. కోర్టు హాల్‌లో డిఎన్ఎ పరీక్ష ఫలితాలు వింటున్న సుమ ముఖంలో ప్రసన్నత చోటు చేసుకో సాగింది. తెల్లవారి దినపత్రికల్లో 'పురుష దౌష్ట్యం'పై మహిళా లోకం విజయ కేతనం' అంటూ పతాక శీర్షికన ప్రచురించిన వార్తను చదివి సంతోషంతో రాఘవమ్మ హృదయం విప్పారింది. ■